

కలెక్టర్‌ను కలిసిన కోరుట్ల ఎమ్మెల్యే

కోరుట్ల: కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కలెక్టర్ సత్య ప్రసాద్‌ను గురువారం కలిశారు. డీఎంఎఫ్ నిధులు మంజూరు చేయాలని, మినీట్యాంక్ బండ్‌లో గుర్రపు డెక్క తొలగించాలని, లైబ్రరీల్లో పుస్తకాలు పెంచాలని కోరారు.



చూస్తే చిల్లరే.. కోట్లలో దోపిడీ

కోడి కూర .. ఈ పేరు వింటేనే నోరూరుతోంది. నుట్టమొచ్చినా.. సంతోష వేడుకైనా.. విషాదమైనా ముక్కలు ఉడకాల్సిందే.

10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
37.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి పెరుగుతుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జూనియర్ కళాశాల ప్రారంభం



విప్ శ్రీనివాస్‌కు చెక్కు అందిస్తున్న రాజాగౌడ్

మేడిపల్లి: మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందించారు. పోరుమల్లలో మడేలేశ్వర స్వామి బోనాల జాతరలో పాల్గొన్నారు. ఏళ్ల తరబడి ఎదురుచూసిన విద్యార్థులకు కళాశాల అందుబాటులోకొచ్చిందన్నారు. కళాశాల అభివృద్ధికి మాజీ సర్పంచ్ బొంగోని రాజగౌడ్ రూ.1.01 లక్షలను విరాళంగా అందించారు. ముందుండు కూడా సహకరిస్తానని పేర్కొన్నారు. అలాగే ఇందిరమ్మ ఇల్లు ముందుగా పూర్తి చేసుకున్నవారికి మొదటి బహుమతిగా రూ.50వేలు, రెండో బహుమతిగా రూ.40 వేలు, మూడో బహుమతిగా రూ.25వేల అందిస్తానని ప్రకటించారు.

వైద్యాధికారుల పోస్టులకు ఆహ్వానం

జగిత్యాల: జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్టు ప్రతిపాదికన నాలుగు వైద్యాధికారుల పోస్టుల భర్తీకి ఎంబీబీఎస్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉన్న అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ తెలిపారు. రూ.500 డీడీని మెడికల్ హెల్త్ ఆఫీస్ పేరిట తీసి దరఖాస్తులను jagtial.telangna.gov.in వెబ్‌సైట్ నుంచి తీసుకుని విద్యార్హతల పత్రాలతో ఈనెల 26 వరకు జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న, గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిశీలించబోమని తెలిపారు.

రైతుల ఖాతాల్లో రూ.190.62 కోట్ల జమ

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని 2,10,145 మంది రైతులకు రైతుభరోసా కింద గురువారం వరకు రూ.190.62 కోట్లు జమ అయ్యాయి. జిల్లాలో మొత్తం 2,48,550 మంది రైతులు ఉండగా.. వారికి రూ.251.14 కోట్లు జమ కావాల్సి ఉంది. 18న 1,79,818 మందికి రూ.120.67కోట్లు, 19న 30,327 మందికి రూ.69.95కోట్ల చొప్పున జమ అయ్యాయి.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్



పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన వాహనాలు

జగిత్యాలక్రైం: జిల్లావ్యాప్తంగా రిజిస్ట్రేషన్ లేని, నంబరు ప్లేట్ లేని 306 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో ముమ్మర తనిఖీలు చేపట్టాయన్నారు. కొందరు ట్రాఫిక్ చలానాల నుంచి తప్పించుకునేందుకు ఫ్యాన్సీ నంబర్లు, తప్పుడు నంబర్లను ఏర్పాటు చేసుకున్నట్లు గుర్తించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నంబరు ప్లేట్ ఏర్పాటు చేసినా.. వాహనాలు రోడ్డుపై తిప్పినా చీటింగ్ కేసు నమోదు చేస్తామన్నారు.

అర్చకుల సమస్యలపై వినతి

జగిత్యాలరూరల్: ఆలయ అర్చకుల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి వీర శైవ అర్చక సమైక్య అధ్యక్షుడు గుంటి జగదీశ్వర్ వినతిపత్రం సమర్పించారు. ఆయన వెంట రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్, ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, ఉమా మహేశ్వర్ ఉన్నారు.

జగన్నాథ రథయాత్రలో పాల్గొనండి



జగిత్యాలటౌన్: జూలై ఒకటిన నిర్వహించే జగన్నాథ రథయాత్రలో పాల్గొనాలని ఇస్కాన్ ప్రతినిధులు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌ను కోరారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రిక అంచారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు నరహరిదాస్, ప్రేమనందగోవిందదాస్, మున్సిపల్ మాజీ చైర్మన్లు అడువాల జ్యోతి, గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బల్దియా స్థలాలు కబ్జా

- విలువైన స్థలాల్లో ఆక్రమణలు
- కాంప్లెక్స్ నిర్మిస్తే అధిక ఆదాయం
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు



ఈ చిత్రంలో కన్పిస్తున్నది జిల్లాకేంద్రంలోని కొత్తబస్టాండ్ ఎదురుగా ఉన్న ఉద్యానవనానికి సంబంధించిన అత్యంత విలువైన స్థలం. ఈ స్థలంలో పండ్ల దుకాణాలు, హోటళ్లు, టీస్టాల్స్, దుకాణాలు అక్రమంగా వెలిశాయి. ఇంత విలువైన స్థలాన్ని కొందరు ఆక్రమిస్తున్నా మున్సిపల్ అధికారులు మాత్రం పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు. ఈ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే మున్సిపాలిటీకి ఆదాయం రావడంతోపాటు అభివృద్ధి కూడా జరుగుతుందని స్థానికులు అంటున్నారు.

జగిత్యాల: జిల్లా కేంద్రంలో మున్సిపల్ అనుమతి లేకుండా ఎవరైనా ఇల్లు నిర్మించుకున్నా.. సెట్‌బ్యాక్ లేకున్నా.. ఎలాంటి నోటీసులు లేకుండానే కూల్చివేస్తున్నారు. కానీ మున్సిపల్ స్థలాలు యథేచ్ఛగా కబ్జా చేసుకుంటే మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. నిర్మాణాలను ఎలా కూల్చివేస్తున్నారో స్థలాలను ఆక్రమించుకున్న వారిని కూడా వెళ్లగొట్టి స్వాధీనం చేసుకోవాలని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. దుకాణాలను అద్దెకు తీసుకుని.. దాని ఎదుట మరో దుకాణం పెట్టి.. రేకుల షెడ్డుతో కబ్జా చేస్తున్నారు. ఇది అంతా అధికారుల కళ్ల ముందే జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

అధికారుల పర్యవేక్షణ ఎక్కడ

జిల్లాకేంద్రంలో వ్యాపార, వాణిజ్య కేంద్రాలు భారీగా వెలిశాయి. ఇటీవల వ్యాపారాలు పెరగడంతో ఎలాంటి సదుపాయాలు లేకుండా భవనాలు నిర్మించడం, ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం.. డ్రైనేజీలపై కప్పులు వేసుకున్నా అధికారులు పట్టించుకోలేదు. ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉద్యానవనాన్ని ఆనుకుని ఉన్న స్థలం కోట్లాది రూపాయల విలువైనది. ఇప్పటి వరకు మున్సిపల్ అధికారులు దాంట్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా బల్దియాకు అత్యధిక ఆదాయం చేకూరేది. కానీ మున్సిపల్ అధికారులు ఊసే ఎత్తడం లేదు. ఇలా అనేక చోట్ల అక్రమాలు అత్యధికంగా ఉన్నాయి.

ఆదాయానికి భారీగండి

ప్రభుత్వ స్థలాల్లో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే కోట్లాది రూపాయల ఆదాయం వచ్చేది. అధికారులు పాకలవర్గాలు పట్టించుకోకపోవడంతో ఆ ఆదాయానికి గండి పడుతోంది. గతంలో అంగడి బజార్‌లో ఉన్న ఖాళీ స్థలలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే ఒక్కో షాపు రూ.4 నుంచి రూ.5 లక్షలతో టెండర్లు దక్కించుకున్నారు. కోట్లాది రూపాయల విలువ గల స్థలాల్లోని అక్రమణలను తొలగిస్తే జిల్లాకు ఆదాయం అధిక సంఖ్యలో లభిస్తుంది. కొన్ని చోట్ల షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించినప్పటికీ ఆశించిన మేర నిర్మాణం చేపట్టలేదు.

మున్సిపల్‌కు కొంత మేరే చెల్లింపులు

మున్సిపల్ స్థలాల్లో అక్రమంగా షెడ్లు వేసుకుని అందులో వ్యాపారం నిర్వహించుకోగా.. మున్సిపల్‌కు ఎంతో కొంత మాత్రమే ఫీజు చెల్లిస్తున్నట్లు తెలిసింది. బల్దియా అధికారులు సైతం ఫీజులు తీసుకుని మిన్నకుంటున్నారు. వారు మాత్రం మున్సిపల్‌కు నామమాత్రంగా ఫీజులు తీసుకుని అద్దెలు తీసుకుంటున్నారు. విలువైన స్థలాల్లో అక్రమణలను తొలగించి షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

షెటర్ల ముందు షెడ్లు..

షెటర్లను అద్దెకు తీసుకున్న వారు వాటిని ఆనుకుని మరో షెటరంతా రేకులషెడ్లు వేసి సామాను ముందు పెట్టడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ప్రజలు నడిచేందుకు ఇబ్బందికి గురవుతున్నారు. ముఖ్యంగా జిల్లాలో టవర్‌సర్కిల్, తహసీల్ చౌరస్తా, కొత్త బస్టాండ్, పాతబస్టాండ్ తదితర ప్రాంతాల్లో అధికంగా వాణిజ్య సముదాయాలున్నాయి. ఇటీవల నూతనంగా షాపింగ్‌మాల్స్ వెలువగా వారు సైతం ఎలాంటి ట్రాఫిక్‌కు సంబంధించినవి ఏర్పాటు చేసుకోకపోవడంతో వాహనాలు పెట్టుకునేందుకు ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. జిల్లాలోని కోరుట్లలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది.

చర్యలు తీసుకుంటాం



మున్సిపల్ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. విలువైన స్థలాలను స్వాధీనం చేసుకునేలా చర్యలు చేపడతాం. మళ్లీ షెటర్ల ముందు రేకులషెడ్లు వేస్తూ ప్రజలకు ఇబ్బందులు పెట్టకూడదు. కఠిన చర్యలు చేపడతాం.

– శ్రీనివాస్, టీపీవో

పశువుల మందుల్లేవ్..



గొర్రెలను మేతకు తీసుకెళ్తున్న పెంపకందారులు



రాయికల్ ఆస్పత్రిలో మందులు లేక ఖాళీగా ఉన్న బీరువా

- సరఫరా కాని నట్టల నివారణ మందులు
- ఏడు నెలలుగా నిలిచిపోయిన వైనం
- ప్రైవేటు దుకాణాల్లోనే కొనుగోలు
- నష్టపోతున్న పశువుల పెంపకందారులు

జిల్లాలో పశువులు

2,74,934 గొర్రెలు, మేకలు
50,753 గేదెలు
19,000 ఆవులు

రాయికల్: సహజంగానే వర్షకాలంలో గొర్రెలు, మేకలు వివిధ వ్యాధుల బారిన పడతాయి. వాటిని కాపాడుకునేందుకు పెంపకందారులు అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. ఇలాంటి వారికి ప్రభుత్వమే పశువుల మందులను అందించాల్సి ఉంటుంది. అయితే కనీసం నట్టల నివారణ మందును కూడా ప్రభుత్వం నుంచి పంపిణీ కాలేదు. ఏడు నెలలుగా ఇదే దుస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి మందులు లేకపోవడంతో పెంపకందారులు ప్రైవేటు మందుల దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోంది. వర్షకాలంలో పశువుల్లో చిటుకు రోగం, నీలి నాలుక, ఫుట్రాట్ వ్యాధి, గాలికుంటు, కుంటుపట్టడం వంటి వ్యాధులు ఎక్కువగా ప్రబలుతాయి. ఈ వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వం నుంచి సరఫరా అయ్యే మందులు ఏడు నెలలుగా సరఫరా నిలిచిపోయింది. ముఖ్యంగా నట్టల నివారణ మందుల కోసం ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించి వేలాది రూపాయలు చెల్లించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీలినాలుక నియంత్రణకు వేసే బ్లూటంగ్, హెచ్ఎఫ్ డీక్యూ, గొంతువాపు టీకాలు, పీపీఆర్, ఎల్ఎఫ్‌జీ వంటి వ్యాక్సిన్లు సరైన సమయంలో సరఫరా కాకపోవడం గమనార్హం. సరఫరా అయిన వ్యాక్సిన్లు కూడా సంబంధిత వైద్యాధికారులు బయట విక్రయిస్తూ అందినంతా దోచుకుంటున్నారు.

ఏడు నెలలుగా సరఫరా కాని మందులు

ప్రతి నాలుగు నెలలకోసారి పాడి రైతులకు ప్రభుత్వం మందులను సరఫరా చేయాల్సి ఉండగా.. ఏడు నెలల నుంచి మందులు రావడం లేదు. గొర్రెలు, మేకల కోసం ప్రభుత్వం నట్టల నివారణ మందు, జ్వరం, నీలినాలుక, యాంటిబయటిక్స్, వ్యాక్సిన్లు సరఫరా చేసే అవకాశం ఉంది. పాడి గేదెలకు లంపిస్కిన్ కోసం ప్రభుత్వం ఉచితంగా టీకాలు పంపిణీ చేయాల్సి ఉండగా గతంలో సరైన సమయంలో పంపిణీ చేయకపోవడంతో చాలా ఆవులు, గేదెల్లో ఈ వ్యాధితో మృత్యువాతపడ్డాయి. ఆస్పత్రి అభివృద్ధికి నిధులు కేటాయించాల్సి ఉండగా.. ఇప్పటివరకు బడ్జెట్ కూడా విడుదల కాకపోవడంతో పశువైద్య ఆస్పత్రిలో కనీసం కూర్చునేందుకు కుర్చీలు లేవు. రిజిస్టర్ లేకపోవడంతో పశువైద్యాధికారులు తమ జేబులోంచి ఖర్చు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వర్షకాలం పూర్తయ్యేలోపు పశువులకు సంబంధించిన మందులను సరఫరా చేయాలని, సకాలంలో వ్యాక్సిన్లు వేయాలని కోరారు.

నట్టల మందు ఇవ్వడం లేదు



వర్షకాలం ప్రారంభమైనప్పటికీ నట్టల మందు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి మంజూరు కాలేదు. ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. జ్వరం, ఇతర మందులు ప్రభుత్వ పశు వైద్య కేంద్రాల్లో ఉండటం లేదు.

– నవీన్, రాయికల్, రైతు

బడ్జెట్ రాగానే పంపిణీ



ప్రభుత్వం నుంచి బడ్జెట్ రాగానే సీజనల్ వ్యాధి మందులు పంపిణీ చేస్తాం. ప్రస్తుతం వ్యాక్సిన్లు వేసే ప్రక్రియ కొనసాగుతోంది. దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దు. ప్రభుత్వ వైద్యులు వ్యాక్సిన్ విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– వేణుగోపాల్, జిల్లా పశువైద్యాధికారి

ఎన్నికలొస్తున్నాయనే రైతుభరోసా



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల: ఎన్నికలొస్తున్నాయనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా విడుదల చేసిందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లకు గాలం వేసేందుకు రైతుభరోసా ఇచ్చారని పేర్కొన్నారు. సీఎంకు రాష్ట్రంలోని ఏ ప్రాజెక్టులపైనా అవగాహన లేదన్నారు. ఎంపీ అర్వింద్ బనకచర్లను జనకచర్ల అనడం ఆయనకున్న పరిజ్ఞానానికి అద్దం పడుతోందన్నారు. ప్రజలకు అన్ని విషయాల్లో మేలు చేసింది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని గుర్తు చేశారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న కోరుట్ల యువతకు ఉపాధి కల్పన కోసం కటుకం సంగయ్య ఫంక్షన్‌హాల్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరించారు. బీఆర్ఎస్ నాయకులు దారిశెట్టి రాజేశ్, చీటి వెంకట్రావ్, కేతిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అతిక్, వంతడుపుల అంజయ్య, మోహన్‌రెడ్డి, రాజమురళి, సురేందర్‌లు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మాజీమంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల/జగిత్యాలటౌన్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను జిల్లాకేంద్రంలోని ఇందిరాభవన్‌లో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. రాహుల్‌గాంధీ జైబాపు, జైభీం, జైసంవిధాన్ నినాదంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. పీసీసీ కార్యదర్శి బండ శంకర్, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, నాయకులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: భవిష్యత్ ఆశాజ్యోతి రాహుల్‌గాంధీ అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, గోలి శ్రీనివాస్ ఉన్నారు.

‘కర్ర’ంట్‌కు ఊతం



పెగడపల్లి: మండలంలో వేలాడుతున్న విద్యుత్ వైర్లు వెక్కిరిస్తున్నాయి. లూజ్‌వైర్లు, కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పంట పొలాల వద్ద వేలాడుతున్న తీగలను సరిచేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదంటున్నారు. ఏడుమోటలపల్లి శివారులో విద్యుత్ వైర్లు వేలాడుతుండడంతో ఓ రైతు ఇదిగో ఇలా కర్ర సహాయంతో వైర్లను పైకి లేపాడు.

ప్రజారోగ్యంపై వైద్యసిబ్బంది దృష్టిసారించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

కథలాపూర్: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజారోగ్యంపై వైద్యసిబ్బంది దృష్టిసారించాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ అన్నారు. గురువారం కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారులతోపాటు వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం వివరాలు తెలుసుకునేందుకు వైద్యసిబ్బంది ఇంటింటా సర్వే చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు శ్రీనివాస్, రవీందర్, సత్యనారాయణ, వైద్యాధికారులు సింధూజ, రచన, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి



కోనాపూర్‌లో బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభిస్తున్న డీఈవో

జగిత్యాల/సారంగాపూర్: విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్లు, వీడియోగేమ్‌లకు దూరంగా ఉంటే మానసిక ఒత్తిడి తగ్గుతుందని, పిల్లలు చదువుతోపాటు క్రీడలకు సమయం కేటాయించాలని డీఈవో రాము అన్నారు. గురువారం బీర్‌పూర్ మండలంకేంద్రం, కొల్వాయి, తుంగూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. కోనాపూర్‌లో బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభించారు. జిల్లా కో–ఆర్డినేటర్ రాజేశ్, ఎంఈవోలు నాగభూషణం, కిశోర్, హెచ్ఎంలు భాస్కర్‌రెడ్డి, సత్యరాజ్, శంకరయ్య, వేణు, పెటా జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఉన్నారు. విద్యార్థుల్లో భవిష్యత్ నైపుణ్యాలు పెంచేందుకు అటల్ టింకరింగ్ మెకథాన్ బూట్ క్యాంప్ శిక్షణ ఉపయోగపడుతుందని డీఈవో అన్నారు. జిల్లాకేంద్రంలోని పురాతన పాఠశాలలో విద్యార్థులకు బూట్ క్యాంప్ శిక్షణ నిర్వహించారు. ఏఐ, ఎంఎల్, కోడింగ్, త్రీడీ ప్రింటింగ్ నేర్చుకోవాలన్నారు.

ఉల్లాస్‌యాప్‌లో నమోదు చేయాలి

నిరక్షరాస్యులను ఉల్లాస్‌యాప్‌లో నమోదు చేయాలని డీఈవో అన్నారు. ధరూర్ క్యాంప్‌లోని టీచర్స్ భవన్‌లో జాతీయ సాక్షరాభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ఉల్లాస్‌యాప్ ఉపయోగపడుతుందన్నారు. 14 ఏళ్లు నిండిన నిరక్షరాస్యులు, 60ఏళ్ల లోపు వారిని గుర్తించి ఇందులో చేర్చాలన్నారు. వయోజన విద్యాధికారి ప్రతాప్‌రావు, సార్వత్రిక సమన్వయకర్త నాగేశ్వర్‌రావు, డీఆర్డీఏ డీపీఎం మల్లేశ్, మెప్మా పీడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

21న యోగా దినోత్సవం

ఈనెల 21న యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు డీఈవో తెలిపారు. జిల్లాలోని ప్రతి పాఠశాలలో ఆరోగ్య భారత్ నిర్మాణ్‌లో భాగంగా హెచ్ఎంలు వేడుకలు నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో ఉదయం 6.30 నుంచి 7.45వరకు పిల్లలకు యోగాపై అవగాహన కల్పించాలన్నారు.

ప్రమాదం జరిగినప్పుడే హడావుడి

- ఏడాదిన్నర క్రితం కోరుట్లలోని భీమునిదుబ్బ కల్లూర్‌రోడ్‌లో గాలిపటం ఎగరేస్తున్న ఇద్దరు చిన్నారులు 33 కేవీ లైన్ విద్యుత్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఓ చిన్నారి అవిటివాడయ్యాడు. మరో చిన్నారి తీవ్ర గాయాలతో ప్రాణపాయ స్థితి నుంచి బయటపడ్డాడు.

- ఐదు రోజుల క్రితం కోరుట్ల–మెట్‌పల్లి జాతీయ రహదారి వెంబడి 33 కేవీ లైన్ స్తంభం తక్కువ ఎత్తులో ఉండటంతో తయారీలో ఉన్న గణపతి విగ్రహాన్ని తరలిస్తున్న పది మందికి షాక్ తగిలింది. వీరిలో ఇద్దరు ప్రాణాలు వదిలారు. ఆరుగురు తీవ్రగాయాలతో ప్రాణాపాయస్థితిలో ఆసుపత్రుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.

- ఆ తర్వాత మర్చిపోతున్న విద్యుత్ అధికారులు
- తాజాగా కోరుట్ల ప్రమాద స్థలంలో కొత్త స్తంభాలు



ప్రమాద స్థలంలో ఏర్పాటు చేసిన కొత్త విద్యుత్ స్తంభాలు

కోరుట్ల: ఈ రెండు సందర్భాల్లోనూ ట్రాన్స్‌కో అధికారులు సంఘటన జరిగిన సమయంలో చూపిన హడావుడి ఆ తరువాత చూపడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాణాపాయ స్థితి ఉంటేనే ట్రాన్స్‌కో అధికారులు పరిష్కారంపై దృష్టి పెడతారా..? అన్న అనుమానంతో జనం ఆందోళన చెందుతున్నారు.

హడావుడితో సరి..

ఏడాదిన్నర క్రితం కరెంటు షాక్‌తో ఇద్దరు చిన్నారులు గాయపడిన వెంటనే ట్రాన్స్‌కో అధికారులు వారంపాటు హడావుడి చేశారు. ముప్పై ఏళ్లుగా ఇళ్లపై నుంచి వెళ్తున్న హైటెన్షన్ వైర్లను తొలగిస్తామని ప్రకటించారు. సదరు హైటెన్షన్ వైర్ల తొలగింపు కోసం రూ.50 లక్షలు కేటాయించాలని మున్సిపల్ అధికారులకు లేఖ రాసినట్లు సమాచారం. ఆ నిధులు రాకపోవడంతో ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు. భీమునిదుబ్బ, ప్రకాశం రోడ్ ఏరియాలను కలుపుతూ సుమారు 150 ఇళ్లపై నుంచి హైటెన్షన్ వైర్లు యథాతథంగా ఉన్నాయి. ఇప్పటికీ అ ప్రాంతజనం వర్షాకాలం వస్తే చాలు ఎప్పుడేం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

తాత్కాలిక మరమ్మతులు

ఆదివారం కరెంట్ షాక్‌కు కారణమైన వల్లంపల్లి 33 కేవీ లైన్ వేలాడుతున్న విషయాన్ని ఇదివరకు స్థానికులు చాలామంది ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఆ ప్రాంతానికి చెందిన కౌన్సిలర్ 33 కేవీలైన్ స్తంభాలు మార్చి 11 మీటర్ల ఎత్తు ఉన్న స్తంభాలు వేయాలని ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినట్లు తెల్సింది. ఈ వినతులకు స్పందించి ట్రాన్స్‌కో అధికారులు అప్పుడే టవర్లు వేసి సరిదిద్దే ప్రయత్నం చేయగా.. స్థానికులు అభ్యంతరాలు చెప్పినట్లు తెలిసింది. అయితే ట్రాన్స్‌కో అధికారులు టవర్ల ఏర్పాటులో చొరవ చూపకపోవడంతో 33 కేవీ లైన్లు అలాగే ఉండిపోయాయి. ప్రమాదం జరగగానే ట్రాన్స్‌కో అధికారులు హడావుడిగా మంగళవారం ప్రమాదస్థలంలో కొత్త స్తంభం వేసి లైన్ ఎత్తు పెంచారు. అనంతరం గతంలో ప్రమాదం చోటు చేసుకున్న కల్లూర్ రోడ్ ఏరియాలోని హైటెన్షన్ వైర్లను పరిశీలించి పరిష్కారం కోసం ప్రతిపాదనలు పంపామని స్థానికులకు చెప్పడం గమనార్హం. ఇటీవల కరెంట్ ప్రమాదం జరిగిన చోట టవర్లు ఏర్పాటు చేస్తామని, పట్టణంలోని ఇతర ప్రాంతాల్లో ఎక్కడైనా విద్యుత్ వైర్లు వేలాడుతూ, ప్రమాదకరంగా ఉంటే వెంటనే తమ సిబ్బంది దృష్టికి తేవాలని ట్రాన్స్‌కో ఏడీఈ రఘుపతి తెలిపారు. కల్లూర్‌రోడ్‌లోనూ ప్రమాదకరంగా ఇళ్లపై నుంచి వెళ్తున్న హైటెన్షన్ వైర్లు సరిచేసేందుకు త్వరలో 11 మీటర్ల ఎత్తు ఉన్న స్తంభాలు వేయిస్తామన్నారు.

క్లుప్తంగా

మద్యంమత్తులో బైక్‌కు నిప్పు



మంటల్లో కాలిపోతున్న బైక్

మల్యాల: మండలంలోని రాజారం శివారులో మద్యం మత్తులో ఓ యువకుడు తన బైక్‌కు నిప్పుపెట్టాడు. దీంతో అది పూర్తిగా కాలిపోయింది. జగిత్యాల మున్సిపాలిటీ పరిధి టీఆర్‌నగర్‌కు చెందిన సలీం గురువారం సాయంత్రం రాజారం శివారులో తన ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. మద్యం మత్తులో దానికి నిప్పు పెట్టాడు. స్థానికుల సమాచారంతో బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ సురేశ్, హోంగార్డు నర్సింగరావు సంఘటనాస్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలు ఆర్పివేశారు.

హత్య కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు

జగిత్యాలజోన్: మద్యం మత్తులో జరిగిన గొడవలో ఒకరిని హత్య చేసిన కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. రత్న పద్మావతి గురువారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. రాయికల్ మండలం ధర్మాజీపేటకు చెందిన సావన్‌వెల్లి రాజుకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. ఇద్దరు కూతుళ్లకు పెళ్లయ్యింది. కొడుకు శేఖర్ వ్యవసాయంతోపాటు గ్రామంలో కూలీ పనులకు వెళ్లేవాడు. అదే గ్రామానికి చెందిన రాస రాజేశం, బలిజే నాగ భూషణంతో పరిచయం ఏర్పడింది. వారితో కలిసి కూలీ పనులకు వెళ్తూ.. వచ్చిన డబ్బులతో అందరూ కలిసి జల్సా చేసేవారు. 22 మార్చి 2022న శేఖర్ ఇంటి వద్ద ఉండగా.. సాయంత్రం 4 గంటల సమయంలో బలిజే నాగభూషణం వచ్చి శేఖర్‌ను ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని వెళ్లాడు. రాత్రి అయినా శేఖర్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆయన కోసం వెదుకుతుండగా మరుసటి రోజు గ్రామ శివారులో శేఖర్ శవమై కనిపించాడు. మృతుడి తల్లి రాజు రాయికల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై పి.కిరణ్‌కు మార్ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ వై.కృష్ణ కుమార్ కేసును దర్యాప్తు చేశారు. మద్యం మత్తులో జరిగిన గొడవలో రాస రాజేశం, బలిజె నాగ భూషణం శేఖర్‌ను హత్య చేసినట్లు తేల్చారు. నిందితులను అరెస్ట్ చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు ఎం. కిరణ్‌కుమార్, కె. నరేశ్ కోర్టులో సాక్ష్యాలను ప్రవేశపెట్టగా రాజేశం, నాగభూషణంకు ఏడేళ్ల చొప్పున జైలు, రూ.3వేల చొప్పున జరిమానా విధించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి గొర్రెల కాపరి మృతి

ధర్మారం: ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పెద్ది మల్లయ్య గురువారం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మరణించినట్లు ధర్మారం ఎస్సై శీలం లక్ష్మణ్ తెలిపారు. గొర్రెల కాపలాకు వెళ్లిన మల్లయ్య మంచినీరు తాగేందుకు బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించాడు. మృతుని భార్య పెద్ది పోశవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చూస్తే చిల్లరే.. కోట్లలో దోపిడీ

కరీంనగర్ రాంనగర్‌కు చెందిన శ్రీధర్ రావు బంధువులు వచ్చారని చికెన్ కొందామని మార్కెట్‌కు వెళ్లాడు. పేపర్ ధర(ఆన్‌లైన్ సీఎమ్మార్) ప్రకారం జనరల్ కిలో కోడి ధర రూ.91 ఉండగా కిలో కోడి ధర రూ.120కి విక్రయించారు. పేపర్ రేట్ కదా ఇదేంటంటే గిట్టుబాటు కాదని సమాధానం. పట్టణంలోనే ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో మరీ దారుణం. ఇది ఒక్క శ్రీధర్ పరిస్థితే కాదు.. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చికెన్ కొనుగోలు చేసే సగటు వినియోగదారుని పరిస్థితి.



- ధరలు ఇష్టారాజ్యం.. నియంత్రణ పూజ్యం
- వినియోగదారులను దోచుకుంటున్న చికెన్ సెంటర్లు
- దళారులదే రాజ్యం.. పేరుకే పేపర్ రేట్ కానీ అదనమే
- కోళ్ల ఫారం యజమానులకు అంతంతే

గురువారం ధరలిలా

ఫారం దగ్గర కిలో కోడి	రూ.91
చికెన్ సెంటర్‌లో కిలో కోడి	రూ.113
స్కిన్‌తో	రూ.164
స్కిన్‌లెస్	రూ.186

కరీంనగర్ అర్బన్: కోడి కూర .. ఈ పేరు వింటేనే నోరూరుతోంది. సుట్టమొచ్చినా.. సంతోష వేడుకైనా.. విషాదమైనా ముక్కలు ఉడకాల్సిందే. జిల్లాలో వీటి వినియోగం ఎక్కువ. నిత్యం 40 వేల క్వింటాళ్ల చికెన్ అమ్ముడుపోతుండగా.. చికెన్ సెంటర్ల నిర్వాహకులకు కాసుల పంటే. పేరుకు పేపర్ రేటని చెబుతూ వీలైనంత మేర దండుకుంటున్నారు. పేపర్ ధర ఒకటైతే విక్రయించేది మాత్రం కిలోకు రూ.40 అదనం. ఇదేంటంటే మేమింతే..నన్న ఈసడింపు సమాధానం. జిల్లాలో నిత్యం రూ.4.20 కోట్ల వ్యాపారం సాగుతుండగా అదనంగా రూ.1.20 కోట్లు దోచుకుంటున్నారు. ఈ లెక్కన నెలకు రూ.36 కోట్ల మేర వినియోగదారులను పిండేస్తుండగా నియంత్రించే వారే లేకపోవడంతో అడ్డూఅదుపూ లేకుండా పోతోంది.

చికెన్ సెంటర్లు.. దళారులకే లాభం

కోళ్ల పరిశ్రమ స్వయం ఉపాధిగా వెలుగొందుతుండగా దీనిపై ప్రభుత్వానికి ఎలాంటి అధికారం లేదు. హెచరీస్, కోళ్ల ఫారం యజమానులు, ట్రేడర్స్, చికెన్ సెంటర్ల నిర్వాహకులు ఇలా వినియోగదారులకు చికెన్ చేరుతుండగా యజమానుల పరిస్థితి అటుంచితే ట్రేడర్లు, చికెన్ సెంటర్ల నిర్వాహకులే ధరలను శాసిస్తున్నారు. సొమ్మొకడిది సోకొకరిదన్నట్లు గంటల వ్యవధిలోనే లాభాలు గడిస్తున్నారు ట్రేడర్లు. పుట్టగొడుగుల్లా ట్రేడర్లు పుట్టుకొస్తుండగా.. చికెన్ సెంటర్లు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. జిల్లాలో సుమారు 10 వేలకు పైగా చికెన్ సెంటర్లు ఉండగా ట్రేడర్లు సుమారు 500లకు పైగా ఉన్నారు. కోళ్ల ఫారం యజమానుల నుంచి ఆన్‌లైన్ సీఎమ్మార్ ధరల ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. ఉదాహరణకు కిలో కోడి ధర రూ.90 ఉంటే మైనస్ 5, మైనస్ 10కి తక్కువగా కొనుగోలు చేస్తూ చికెన్ సెంటర్ నిర్వాహకులకు రూ.90కి అదనంగా రూ.5, 10కి ఎక్కువగా రవాణా పేరుతో విక్రయిస్తున్నారు. అంటే కిలో కోడికి రవాణా ఖర్చులు పోనూ రూ.15కు అదనంగా విక్రయిస్తున్నారు. ఒక ట్రాలీ ఆటో జాలీలో 300–800ల వరకు కోళ్లను సరఫరా చేస్తారు. ఒక కోడి యావరేజ్‌గా 2.300 కిలోలున్నా.. రూ.30 వేల వరకు ఆర్జిస్తున్నారు. ఇదిలా ఉంటే చికెన్ సెంటర్ల నిర్వాహకులు ట్రేడర్ సరఫరా చేసిన ధరకు రూ.5–10కి ఎక్కువ విక్రయించాలి. కానీ.. ఆచరణలో రూ.30–40వరకు ఎక్కువకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

పుట్టగొడుగుల్లా ట్రేడర్లు

జిల్లాలో పౌల్ట్రీఫాంల నుంచి కోళ్లను కొనుగోలు చేసి చికెన్ సెంటర్లకు సరఫరా చేసేవారి సంఖ్య క్రమేణా పెరుగుతోంది. దీంతోనే ఎక్కువ లాభం ఉండటం.. మైనస్ మంత్రాన్ని జపించడంతో అనతికాలంలో లక్షలు వెనకేస్తున్నారు. ఈ జాబితాలో కోళ్ల ఫారం యజమానులు చేరిపోతున్నారు. ఫారం ద్వారా వచ్చే ఆదాయం కంటే సరఫరా చేస్తే వచ్చే ఆదాయం ఎక్కువగా ఉండగా అదీ రెండు, మూడు రోజుల్లోనే వస్తుండటంతో ఈ వ్యాపారం వైపే మొగ్గుచూపుతున్నారు.

పాపం.. కోళ్ల ఫారం యజమానులు

ట్రేడర్లు, చికెన్ సెంటర్ నిర్వాహకులు, హెచరీస్‌లు వీలైనంత సంపాదిస్తుంటే కోళ్ల ఫారం యజమానులది దారుణ పరిస్థితి. రోజుల వ్యవధిలోనే వారంతా లాభాలు గణనీయంగా పొందుతుంటే పిల్లల నుంచి కోళ్ల వరకు రూపాంతరం చెందే వరకు శ్రమించే యజమానులకు మాత్రం మిగిలేది చిన్న మొత్తమే. జిల్లాలో సుమారు 4 వేల వరకు కోళ్ల ఫారాలున్నాయి. హెచరీస్‌లు కోడి పిల్లలను కోళ్ల ఫాం యజమానులకు సరఫరా చేస్తుండగా 40–45 రోజులకు పెంచి వాటిని సంరక్షించడం చేసే ప్రక్రియ. ఇక దాణా సరఫరా చేసే కంపెనీలు బస్తాలపై ఎలాంటి ముద్రణలు చేయడం లేదు. కేవలం కంపెనీ పేరు మాత్రమే ఉంటుండగా దాణాలో వాడే ముడి పదార్థాలను పేర్కొనడం లేదు. ధర ఉండటం లేదు. కంపెనీని నమ్ముకుని దాణా వేయడమే. ఈ లోపు ఏదైనా వైరస్ వచ్చినా.. మొటలిటీ (మరణించడం) జరిగినా రైతు పైనే భారం. ఇవన్నీ తట్టుకుని కోళ్లను విక్రయించే సమయానికి ట్రేడర్ల దోపిడీ అధికమవుతోంది. దీంతో చేసేదిలేక మైనస్‌లకు విక్రయిస్తూ పెట్టిన పెట్టుబడిలో పావు వంతు కూడా లాభం పొందడం లేదు. కోళ్ల పరిశ్రమను నమ్ముకున్నవారికి ఆశించిన ప్రయోజనం లేదని ఫారం యజమానులు వాపోతున్నారు.

పౌల్ట్రీ మీట్ ఫెడరేషనే మార్గం

కోళ్ల పరిశ్రమపై ఒకప్పుడు ప్రభుత్వ పర్యవేక్షణ ఉండేది. ఫారం యజమానులు నష్టపోయినా, ఏవైనా విపత్తులు సంభవించినా అరకొర సాయమందేది. దీనికి తోడు ప్రభుత్వ రాయితీలుండేవి. ప్రభుత్వ కనుసన్నల్లో 1985 వరకు పౌల్ట్రీ మీట్ ఫెడరేషన్ ఉండేది. కాలక్రమేణ ఫెడరేషన్ కనుమరుగైంది. నిరుద్యోగ యువతకు ఇదో చక్కని అవకాశమే కానీ... సంస్కరణలు అవసరమన్నది యజమానుల వాదన. కాగా... కోళ్ల పరిశ్రమ స్వయం ప్రతిపత్తి గల ప్రైవేట్ రంగం. వీటి ధరలపై మాకెలాంటి అధికారం లేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు, ప్రోత్సాహకాలు లేవని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

జ్యోతినగర్(రామగుండం): పరిశ్రమల్లో విధులు నిర్వహించే కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్ యూనియన్ కార్యాలయంలో జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికవర్గం విజయవంతం చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 23న యాజమాన్యాలకు సమ్మె నోటీసు అందించనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ సంఘాల ఆధ్వర్యంలో జులై9న దేశవ్యాప్తంగా 13వ సారి జరగనున్న సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జేఏసీ నాయకులు ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు భూమల్ల చందర్, నాంసాని శంకర్, చిలుక శంకర్, రెడపాక లక్ష్మణ్, నాగభూషణం, గీట్ల లక్ష్మారెడ్డి, బొద్దున రాజేశం, ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ నాయకులు ఆరెపల్లి రాజేశ్వర్, వేముల కృష్ణయ్య పాల్గొన్నారు.

స్వగ్రామానికి మృతదేహం



లచ్చన్న (ఫైల్)

పెగడపల్లి: ఉపాధి కోసం దుబాయి వెళ్లి ఆత్మహత్య చేసుకున్న ఓ వలసజీవి మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరింది. మండలంలోని బతికపల్లికి చెందిన పూడూరి లచ్చన్న (46) జీవనోపాధి కోసం దుబాయి వెళ్లాడు. తాను పని చేస్తున్న కంపెనీలో సరైన వేతనం లభించక కుటుంబాన్ని పోషించడం భారంగా మారింది. దీంతో మనస్తాపానికి గురైన లచ్చన్న వారంక్రితం తాను ఉంటున్న గదిలో ఉరేసుకున్నాడు. గల్ఫ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గుండెల్లి నరసింహ, ఎన్ఆర్‌ఐ పాలసీ అడ్వైజరీ కమిటీ ఉపాధ్యక్షుడు మంద భీం రెడ్డి సహకారంతో ఆయన మృతదేహం ఇంటికి చేరింది. విగతజీవిగా వచ్చిన లచ్చన్నను చూసిన కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలు మిన్నంటాయి. లచ్చన్నకు భార్య లత, ఇద్దరు కుమారులున్నారు.

మందుపాతరల గణేశ్

- లెంకలగడ్డ బ్లాస్టింగ్ దేశవ్యాప్తంగా సంచలనం
- శాంతిచర్చల్లో పీపుల్స్‌వార్ పార్టీ ప్రతినిధిగా బాధ్యతలు
- మూడు దశాబ్దాలకుపైగా ఏకే 47తోనే చెలిమి



గాజర్ల రవి ఉరఫ్ గణేశ్ (ఫైల్)

మంథని: గోదావరి పరివాహక ప్రాంతంలోని నల్లరేగడి భూముల్లో నక్సల్‌బరి విత్తనాలు మొలకెత్తిన తొలినాళ్లలో వరంగల్ రాడికల్ యువజన సంఘం ఉద్యమాల నుంచి అడవిబాట పట్టిన గాజర్ల రవి ఉరఫ్ గణేశ్ చిన్నవయసులోనే పలు విధ్వంసాలు సృష్టించి కేంద్ర కమిటీ మన్ననలు పొందారు.

దేశంలోనే సంచలనం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల రవి ఉరఫ్ గణేశ్ 1992లో అజ్ఞాతంలోకి వెళ్లారు. 1993లో ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల పరిధిలోని మహాదేవపూర్, ఏటూరునాగారం పీపుల్స్‌వార్ పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఉద్యమాన్ని బలోపేతం చేస్తూనే వర్గ శత్రు నిర్మూలనకు ప్రాధాన్యతనిచ్చారు. 1994 శాసనసభ ఎన్నికల టైంలో మంథని నియోజకవర్గంలోని మహాదేవపూర్ మండలం లెంకలగడ్డ వద్ద శక్తివంతమైన బాంబులు అమర్చి 9 మంది పోలీస్ అధికారులను హతమార్చడంలో కీలకపాత్ర పోషించాడు. ఈ ఘటనలో ఐపీఎస్ ఐజీ స్థాయి అధికారి సాహితోపాటు ఐదుగురు పంజాబ్ కమాండోలు, మహాదేవపూర్ ఎస్‌ఐ వెంకటస్వామి సహా తొమ్మిది మంది మరణించారు. అప్పటి నుంచి సాహి లెంకలగడ్డ బ్లాస్టింగ్‌లో మరణించడం దేశవ్యాప్తంగా సంచలనం అయింది.

కీలకనేతగా ఎదిగిన గాజర్ల

లెంకలగడ్డ బాంబు బ్లాస్టింగ్ అనంతరం గణేశ్ అప్పటి పీపుల్స్‌వార్ పార్టీలో అత్యంత కీలకనేతగా ఏదిగారు. మందుపాతరలు పేల్చడం, ఏకే–47లో వినియోగించడంలో గణేశ్‌కు మరొకరు సాటిలేరు అనే ప్రచారం ఉండేది. గణేశ్ తెగువను, సమర్థవంగా అమలు చేసే వ్యూహాలను పసిగట్టిన అప్పటి పీపుల్స్‌వార్ పార్టీ రాష్ట్ర, కేంద్ర నాయకత్వాలు ఆయనను రాష్ట్ర సభ్యుడిగా నియమిస్తూ ఉత్తర తెలంగాణ వ్యవహారాలను అప్పగించింది. ఆ తర్వాత 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో మహాముత్తారం మండలం కనుకునూర్‌కు రీపోలింగ్‌కు బందోబస్తుకు వెళ్తున్న పోలీస్ సిబ్బందిపై దొబ్బలపాడు కల్వర్టు వద్ద బాంబు బ్లాస్టింగ్ చేసిన ఘటనలో 10 మంది పోలీసులు మృత్యువాత పడ్డారు. భూపాలపల్లి సమీపంలోని బాంబుల గడ్డ వద్ద పేల్చివేత వంటి సంఘటన కూడా అప్పట్లో సంచలన సృష్టించింది. 2002లో మహాదేవపూర్ పోలీస్‌స్టేషన్‌ను పేల్చడానికి బస్సును బాంబుగా అమర్చి సరికొత్త వ్యూహంతో సంచలనం సృష్టించాడు. ఆ తర్వాత ఏవోబీ ఆంధ్రా–ఒడిశా బార్డర్‌కు కార్యదర్శిగా నియమించారు. ఇలాంటి ఎన్నో సంఘటనల్లో గణేశ్ పాత్ర ఉండేది. ఆ తర్వాత పార్టీ నాయకత్వం ఆయనను కేకేడబ్ల్యూ(కరీంగర్, ఖమ్మం, వరంగల్) కార్యదర్శిగా నియమించింది. కొన్ని సంవత్సరాలు తర్వాత రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్న సమయంలో ప్రభుత్వంతో జరిగిన శాంతిచర్చల్లో పీపుల్స్‌వార్ పార్టీ ప్రతినిధుల బృందంలో గణేశ్ చర్చల ప్రతినిధిగా పాల్గొన్నారు.

మూడు దశాబ్దాలకుపైగా ఏకే–47

మహాదేవపూర్ ఏరియా కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ఏకే47 తుపాకీతోనే ఆయన స్నేహం కొనసాగింది. అనేక హింసాత్మక సంఘటనలకు పాల్పడిన గణేశ్ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కంటి మీద కునుకులేకుండా చేశారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో గణేశ్ చనిపోయినప్పుడు ఏకే–47తోనే కనిపించాడని ఆయనతోపాటు పనిచేసిన మాజీ మిలిటెంట్లు కొందరు చర్చించుకుంటున్నట్లు సమాచారం.

దుమాల గురుకులం ప్రిన్సిపాల్ సస్పెన్షన్

- మరిమడ్ల ప్రిన్సిపాల్‌కు బాధ్యతలు



ప్రిన్సిపాల్ మంజిత్‌తో మాట్లాడుతున్న లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య గిరిజన గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ మంజిత్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం తాత్కాలికంగా కోనరావుపేట మండలం మరిమడ్ల గురుకులం ప్రిన్సిపాల్ రాము సూరత్‌యాదవ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. విధులపై నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల ఆర్డర్ల అమలులో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించడంతోనే వేటు పడింది. పాఠశాలలో పనిచేస్తున్న నలుగురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను మూడు రోజుల క్రితం విధుల నుంచి తొలగించడం.. గురుకులాల ఉన్నతాధికారులు ఇచ్చిన ఆర్డర్‌ను పట్టించుకోకుండా వ్యవహరించడాన్ని సీరియస్‌గా పరిగణిస్తూ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

గత 20 ఏళ్లుగా గురుకులంలో పనిచేస్తున్న నలుగురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భూక్య గజన్‌లాల్ డిమాండ్ చేశారు. నాయకులు మాలోత్ కిరణ్‌నాయక్, గుగులోత్ రవినాయక్ ఉన్నారు.

మద్యం మత్తులో కారు డ్రైవింగ్

యువకుడి మృతి.. డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లో డ్రైవర్‌కు 219 పాయింట్లు



కుర్మ నరేశ్ (ఫైల్)



వాహనదారులను హెచ్చరిస్తున్న మద్యం తాగిన యువకుడు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మద్యం మత్తులో కారును నడిపి ఓ నిండు జీవితాన్ని బలితీసుకున్నాడు. ప్రమాదం చేసిందే కాకుండా కావాలంటే పదేళ్లు జైలుకు పోతా.. నన్ను ఏమి చేయలేరంటూ వాహనదారులపై చిందులు వేశాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు. వేములవాడ మండలం చింతలఠాణా ఆర్‌అండ్‌ఆర్ గ్రామానికి చెందిన కుర్మ నరేశ్(38) బైక్‌పై గురువారం జక్కాపూర్ వెళ్తున్నాడు. ఈక్రమంలోనే నేరెళ్ల శివారులో సిద్దిపేట నుంచి తంగళ్లపల్లి వైపు కారు అతివేగంగా రాంగ్‌రూట్లో వచ్చి ఢీకొట్టింది. దీంతో నరేశ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కారు నడిపిన యువకుడు మద్యం మత్తులో ఉండి ప్రశ్నించిన వాహనదారులపైకి చిందులు వేశాడు. పదేళ్ల జైలుకు పోతానంటూ వాగ్వాదానికి దిగాడు. కారు డ్రైవింగ్ చేసిన యువకుడికి బ్రీత్ అనలైజర్ టెస్టు నిర్వహించగా 219 పాయింట్లు వచ్చింది. మృతుడి అన్న కుర్మ రాజేశం ఫిర్యాదుతో తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బొమ్మకల్ పంచాయతీ భవనం విక్రయం!



కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ వార్డు సభ్యులు

- మాజీ ప్రజాప్రతినిధులతో కుమ్మక్కయి ప్రయత్నిస్తున్న రియల్టర్లు
- మున్సిపల్ కమిషనర్‌కు వార్డు మాజీ సభ్యుల ఫిర్యాదు



బొమ్మకల్ గ్రామపంచాయతీ నూతన భవనం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనమైన బొమ్మకల్‌కు చెందిన గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు విక్రయించేందుకు చేస్తున్న ప్రయత్నాలు వివాదాస్పదంగా మారాయి. గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ను వార్డు మాజీ సభ్యులు కలిసి పంచాయతీ భవనం విక్రయించేందుకు చేస్తున్న ప్రయత్నాలపై ఫిర్యాదు చేశారు. కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామ పంచాయతీగా ఉన్నపుడు సర్వే నంబరు–17లోని స్థలాన్ని ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ప్లాట్లుగా చేసి విక్రయించింది. లేఅవుట్ నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీకి విడిచిపెట్టిన మూడు గుంటల స్థలంలో 2023 సంవత్సరంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి అప్పటి మంత్రి గంగుల కమలాకర్ భూమిపూజ చేశారు. మూడు అంతస్తుల్లో భవన నిర్మాణపు పనులను స్థానిక నాయకుడికి అప్పగించారు. పంచాయతీ నిధులు రూ.2,12,000తో విద్యుత్ మీటర్, బోరు వేసి విద్యుత్ మోటారు బిగించారు. స్లాబ్ వేసేందుకు కాంట్రాక్టర్‌కు పంచాయతీ నిధులు రూ.8లక్షలు చెల్లించారు. సర్పంచ్ పదవీకాలం ముగుస్తున్న క్రమంలో 26 జనవరి 2024 సంవత్సరంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆరు నెలల క్రితం బొమ్మకల్ గ్రామాన్ని కార్పొరేషన్‌లో విలీనం చేయడంతో భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారులు పంచాయతీకి కేటాయించిన స్థలాన్ని జీపీకి రిజిస్ట్రేషన్ చేయలేదనే కారణంతో కొందరు మాజీ ప్రజాప్రతినిధులు భవనాన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. సదరు రియల్టర్లతో కుమ్మక్కయి చేస్తున్న ప్రయత్నాలు బొమ్మకల్‌లో చర్చనీయాంశంగా మారాయి. అప్రమత్తమైన వార్డు మాజీ సభ్యులు గూడ తిరుపతిరెడ్డి, వరాల శ్రీనివాస్, తోట కిరణ్‌కుమార్, గాదె శ్రీనివాస్ గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ను కలిసి పంచాయతీ భవనం విక్రయించేందుకు చేస్తున్న ప్రయత్నాలపై ఫిర్యాదు చేశారు. భవనాన్ని స్వాధీనం చేసుకొని వార్డు కార్యాలయంగా ఏర్పాటు చేయాలని కోరగా.. విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటానని కమిషనర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

పెళ్లింట విషాదం

- నెల రోజులు గడవకుండానే నవవరుడి మృతి
- చేయని తప్పుకు శిక్ష అనుభవిస్తున్న కుటుంబం



రోదిస్తున్న బంధువులు

వేములవాడ: పెళ్లయి నెల రోజులు గడవకముందే నవవరుడి మృతి ఆ ఇంట్లో విషాదం నింపింది. మద్యం మత్తులో ఉన్న కరీంనగర్ శివారులోని రేకుర్తికి చెందిన వ్యక్తి అజాగ్రత్తగా.. అతివేగంగా కారుతో ఢీకొట్టడంతో వేములవాడకు చెందిన పండరీనాథ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మే 23న పండరీనాథ్(25) వివాహమైంది. అప్పటి వరకు కుటుంబ సభ్యులతో కలిసి ఓ వేడుకకు హాజరైన పండరీనాథ్ అంతలోనే చనిపోయాడని తెలియడంతో వారి రోదనలు మిన్నంటాయి. మద్యం మత్తులో ఉన్న కారుడ్రైవర్ అప్పటికే రెండు చోట్ల ప్రమాదాలు చేసినట్లు తెలిసింది.

పెళ్లయిన 25 రోజులకే మృతి

మే నెలలో పెళ్లితో కళకళలాడిన ఇల్లు గురువారం శోకసంద్రంగా మారింది. ఇటీవల పెళ్లి బంధానికి తాలూకు వేడుకలు, ఫోటోలు ఇంకా ఇంటి గోడలపై వేలాడుతుండగానే.. అదే ఇంట్లో అంత్యక్రియల ఏర్పాట్లు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు విషాదంలో మునిగిపోయారు. తాత, నానమ్మ, తల్లి, తండ్రిని ఓదార్చే బంధువులు కన్నీరు ఆపులేకపోయారు. నెల రోజుల్లోనే భర్తను కోల్పోయిన వధువు నిలువునా కూలిపోయింది. ఆమె రోదనలకు అంతులేకుండా పోయింది.

విశిష్టత తెలిపేలా యోగా దినోత్సవం నిర్వహణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యాదగిరి శేఖర్ రావు, గౌతంరావు

కరీంనగర్‌కల్చరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని వికాస తరంగిణి, ప్రజ్ఞావికాస్ ఆధ్వర్యంలో కరీంనగర్ మహాత్మ జ్యోతిరావు పూలే సర్కస్ గ్రౌండ్‌లో శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు త్రిదండి రామానుజ జీయర్ స్వామివారి మంగళాశాసనాలతో దేవనాథ రామానుజీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో యోగా విశిష్టత తెలిపేలా యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రజ్ఞావికాస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు, వికాస తరంగిణి జోనల్ అధ్యక్షుడు గౌతంరావు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతీరోజు విద్యార్థులకు యోగా నేర్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థులకు విలువలతో కూడిన విద్య,కుటుంబ విలువలు, కుటుంబ ప్రాముఖ్యత అర్థమయ్యే విధంగా తెలియజేస్తామన్నారు. సమావేశంలో వికాస తరంగణి, ప్రజ్ఞా వికాస్ ఆధ్వర్యంలో యాద కిషన్, సిరికొండ వెంకటేశం, రవీందర్ రావు, ప్రభాకర్ రావు, కర్ణాకర్ రావు, జగన్నాథరావు, ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మానేరు రివర్‌ఫ్రంట్ పనులపై విచారణ జరపాలి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న చాడ వెంకటరెడ్డి

కరీంనగర్: నగరంలోని మానేరు రివర్ ఫ్రంట్ పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి వినతిపత్రం అందించారు. మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పేరుతో గత ప్రభుత్వం రూ. 500 కోట్లు మంజూరు చేసిందని, అందులో టూరిజం శాఖ రూ. 100 కోట్లు, నీటి పారుదల శాఖ రూ. 100 కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించారని తెలిపారు. పనులు పూర్తికాకుండానే బిల్లులు చెల్లించారన్నారు. చెక్ డ్యాములు నిర్మిస్తే వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయాయని, ఐదేళ్లు గడుస్తున్నా పనులు పూర్తికాలేదని ఆయన సీఎంకు వివరించారు.